నేడు గిరిజన చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి గురువారం జిఒ ఎంఎస్ నంబర్ 3, గిరిజన చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహిస్తారని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈ అవగాహన సదస్సు జరుగుతుందని చెప్పారు. సదస్సుకు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, గిరిజన సంఘాలు, న్యాయవాదులు, ఎన్‌జిఒలు, ఇతర నాయకులు తదితరులు తప్పక హాజరుకావాలని కోరారు.

చిరుద్యోగుల తొలగింపే లక్ష్యం

- అధికారులపై మంత్రి ఒత్తిడి
- కరాసువలస కెజిబివి ఎస్‌ఒ సహా సిబ్బందిపై వేటు

జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తన పంతం నెగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా అధికారుల వద్ద తన సిఫార్సులు చెల్లుబాటు కావడానికి ఎంతవరకైనా వెళు తున్నారు. అవసరమైతే ప్రభుత్వంలో ఇతర పెద్దల సహకారం తీసుకునైనా తన మాట నెగ్గించుకుంటూ ఉన్నారు. ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కంటే తన అధికారాన్ని ఉపయోగించి చిన్న చిన్న ఉద్యోగుల తొలగింపులో ప్రతాపం చూపిస్తున్నారు.

ప్రజాశక్తి-పార్వతీపురం

కరాసువలసలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం

సాలూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో గాని, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం గాని మంత్రి సంధ్యారాణి కృషి చేయకపోగా చిరుద్యోగుల తొలగింపుపై దృష్టి పెట్టడంతో సర్వత్రా చర్చ జరుగుతోంది. సుమారు రెండు వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించే జీగిరాం జ్యూట్‌మిల్లు మూతపడి మూడేళ్లు దాటింది. ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిల్లు తెరిపిస్తానని హామీ ఇచ్చారు. దీనిపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. మారుమూల గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేక డోలీమోతల్లో రోగులను మైదాన ప్రాంతానికి తీసుకొచ్చే పరిస్థితి నెలకొంది. గత నెల రోజుల్లో నియోజకవర్గంలో రెండు డోలీమోత సంఘటనలు చోటు చేసుకున్నాయి. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మున్సిపాలిటీ పరిధిలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంతవరకు ఈ సమస్యలకు అతీగతీ లేదు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం ఫైలుపై తొలి సంతకం చేసినా నేటి వరకూ అమలు కాలేదు. ఇవేవీ పట్టని మంత్రి తనకు ఇష్టం లేని, తనకు నచ్చని పార్టీకి సానుభూతి పరులైన చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారు.

గత ఏడాది కాలంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ పరిధిలో వైసిపికి చెందిన వారనే నెపంతో పెదపదం, కేసలి, పి.కోనవలస ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని సిఫార్సు చేశారు. వీరే కాక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా నిర్దాక్షిణ్యంగా తొలగించారు.

కెజిబివి ఎస్‌ఒ, సిబ్బంది సస్పెన్షన్ వెనుక..

సాలూరు మండలంలోని కరాసువలస కెజిబివి ఎస్‌ఒ, నలుగురు వంట మనుషులను సస్పెండ్ చేయించడంలో మంత్రి సంధ్యారాణి కీలకపాత్ర పోషించారు. వారిపై చర్యలు తీసుకోవడానికి జిల్లా అధికారులు తటపటాయిస్తున్నా తగ్గేదేలా! అంటూ ఒత్తిడిని పెంచారు. పదేపదే జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సమగ్ర శిక్ష అధికారులకు ఫోన్ చేసి తన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆమె ఒత్తిళ్లను తట్టుకోలేక చివరికి అధికారులు చిరుద్యోగులను సస్పెండ్ చేశారు. ఏప్రిల్ 9న మంత్రి సంధ్యారాణి కొందరు మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకొని కరాసువలస కెజిబివిని ఆకస్మిక తనిఖీ చేశారు. సరిగ్గా మధ్యాహ్న భోజన సమయానికి వెళ్లి పరిశీలించారు. విద్యార్థినులకు ఉడకని అన్నం, తక్కువ పరిమాణంలో ఆహారం పెట్టారని తనిఖీల్లో నిర్ధారించారు. నాణ్యతలేని ఆహారం పంపిణీకి కారణమెవరో విద్యార్థినులకు, అక్కడ పనిచేస్తున్న అధ్యాపక సిబ్బందికీ తెలుసు. దీనికి కారణమైన స్పెషల్ ఆఫీసర్ జి.ప్రశాంతి, సిబ్బందిని తొలగించాలని ఆరోజు నుంచే ఆమె ప్రయత్నాలు మొదలు పెట్టారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కి ఫోన్ చేసి పాఠశాలపై విచారణ జరిపించాలని ఆదేశించారు. అదే తడవుగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ విచారణ జరిపించారు. సమగ్ర శిక్ష అధికారులు మొదటి సారి విచారణ చేపట్టారు. ఆ నివేదికను కలెక్టర్‌కి అందజేశారు. అది చాలక మరోసారి విచారణకు ఇద్దరు ఎంఇఒలను పంపించారు. వారు కూడా నివేదిక అందజేశారు. ఇదంతా జరిగి నాలుగు నెలలైంది. అధికారుల విచారణలో పాఠశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థినులంతా ఎస్‌ఒ ప్రశాంతి తప్పు లేదనే చెప్పినట్లు తెలిసింది. పాఠశాలలో పని చేస్తున్న వంటమనుషులే వంట సరుకులను దొంగచాటుగా తరలిస్తున్నారని, అందువల్లనే సరిపడా ఆహారం పంపిణీ చేయడం లేదని ఆధారాలతో సహా విద్యార్థినులు విచారణ అధికారులకు వివరించారనే వాదనలు వినిపించాయి. విచారణ నివేదికల ప్రకారం ఎస్‌ఒ ప్రశాంతి తప్పులేదని జిల్లా అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ కారణంతోనే మంత్రి సంధ్యారాణి సిఫార్సులను అమలు చేయడానికి అధికారులు తర్జనభర్జన పడ్డారు. అయినా మంత్రి సంధ్యారాణి.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌పై ఒత్తిడి పెంచి ఎస్‌ఒ ప్రశాంతిని తొలగించాలని హుకుం జారీ చేశారు. ఆమె ఒత్తిళ్లు భరించలేకనే జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సమగ్ర శిక్ష ఎపిసి తేజేశ్వరరావు.. ఎస్‌ఒ ప్రశాంతి, నలుగురు వంట మనుషులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన యువతి ప్రశాంతి అతి కష్టమ్మీద కెజిబివి ఎస్‌ఒ ఉద్యోగం సాధించారు. పిజి చదివి, బిఇడి చేసిన ప్రశాంతి సంపాదనతోనే ఆమె కుటుంబ పోషణ సాగుతోంది. మంత్రి సంధ్యారాణి ఇంతగా ఆమెపై కక్ష కట్టి సస్పెండ్ చేయించడం వెనుక అసలు కారణం.. ఆ యువతికి వైసిపి నాయకులతో బంధుత్వం ఉండడమేనని చర్చ జరుగుతోంది.

కెజిబివి ఎస్‌ఒపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : యుటిఎఫ్

సాలూరు మండలంలోని కరాసువలస కెజిబివి ఎస్‌ఒ జి.ప్రశాంతి సస్పెన్షన్ ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మూడు నెలల క్రితం కెజిబివిని సందర్శించిన సమయంలో అన్నం ఉడకలేదని ఎస్‌ఒ ప్రశాంతిని బాధ్యులిని చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉపాధి కోసం కాంట్రాక్టు ఉద్యోగంలో చేరిన ఆమె కుటుంబాన్ని రోడ్డు మీదకు నెట్టడం అన్యాయమని చెప్పారు. వెంటనే ఆమె సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

చిరుద్యోగుల పొట్ట కొట్టడం దారుణం

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం విస్మరించింది. అంతటితో ఆగకుండా వారిని ఉద్యోగాల నుంచి తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గడచిన ఏడాది కాలంలో జిల్లాలో పదుల సంఖ్యలో చిరుద్యోగులను తొలగించారు. సాక్షాత్తూ మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలో చిరుద్యోగుల తొలగింపు పర్వం కొనసాగుతుండడం దారుణం. వారిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగడం అన్యాయం. కరాసువలస కెజిబివి ఎస్‌ఒ ప్రశాంతి సహా సిబ్బందిని సస్పెండ్ చేయడం అమానుషం. ఇప్పటికైనా ఇలాంటి చర్యలకు ప్రభుత్వం ముగింపు పలకాలి.

- ఎన్‌వై నాయుడు,
సిఐటియు జిల్లా కార్యదర్శి



లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటున్న టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

డిసెంబర్‌లోగా టిడ్కో ఇళ్లు అప్పగింత

గృహ సముదాయాలను పరిశీలించిన చైర్మన్ వి.అజయ్ కుమార్

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్‌లోగా లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు చైర్మన్ వి.అజయ్‌కుమార్ చెప్పారు. బుధవారం చంద్రంపేట వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, డిసెంబర్‌లోగా లబ్ధిదారులకు అప్పగించనున్నామని చెప్పారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 44 వేల మంది బాధితులు ఉన్నారని, బ్యాంకు రుణాలు మంజూరైనా సిబిల్ స్కోర్ బాగులేదనే నెపంతో బ్యాంకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. 70 వేల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. వచ్చే సంక్రాంతి నాటికి లబ్దిదారులు సొంత ఇళ్లలో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం ఇళ్ళకు సంబంధించిన లెక్కలు సరిగ్గా చూపలేదని చైర్మన్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.యశస్విని పాల్గొన్నారు.

జిఒ 3కు ప్రత్యామ్నాయమంటే

కాలయాపన కోసమేనా?

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

జిఒ 3కు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఇంకొక జిఒను తీసుకురావడమంటే కాలయాపన కోసమేననే అనుమానం కలుగుతుందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని తుండ పంచాయతీ జగ్గుదొరవలస గిరిజనులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ 3లో ఉన్న అన్ని రిజర్వేషన్లు అమలు చేసే విధంగా ప్రత్యామ్నాయ జిఒ ఉండాలని, అలా కాకుండా మోసం చేసే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తే గిరిజనులు అంతా తిరగబడతారని హెచ్చరించారు. షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించి, స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించే బాధ్యతను తీసుకుంటామన్న మంత్రి సంధ్యారాణి హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు నూకయ్య, ఆదయ్య, గిరిజన సంఘ నాయకులు కొండ గొర్రి ఉదయ్ కుమార్, నెమలిపిట్ట కళ్యాణ్, వైసిపి మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య డ్రైవ్

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

జిల్లాలో పారిశుధ్య డ్రైవ్ పక్కాగా నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న పారిశుధ్య డ్రైవ్ పోస్టర్లను మంత్రి సాలూరులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామం పారిశుధ్య నిర్వహణలో ముందంజలో ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ ఇందులో భాగస్వామ్యం కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి చేటు

ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా బ్యానర్‌పై సంతకం చేస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్

ప్రజాశక్తి-పార్వతీపురం

పొగాకుతో ఆరోగ్యానికి చేటని, అది చూపే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ఐటిడిఎ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన బ్యానర్‌పై ముందుగా ఆయన సంతకం చేసి అందరికీ పిలుపునిచ్చారు. అధికారులు, సిబ్బంది పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాలు చేశారు. కార్యక్రమంలో పిఒ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని, ఆరోగ్యానికి చేటు కలిగించే దురలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ప్రస్తుత జీవన విధానంలో పొగాకు వినియోగాన్ని నియంత్రించాల్సిన ఆవశ్యకత చాలా ఉందన్నారు. ఇప్పటికే పలు శాఖలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రజలందరూ భాగస్వాములై ఆరోగ్యకరమైన భవిష్యత్తు తరాన్ని నిర్మించడంలో తోడ్పడాలన్నారు. సిగరెట్, బీడి, చుట్ట, ఖైనీ, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ఎంతో మంది కేన్సర్ మొదలగు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అనంతరం అందరితో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కెవిఎస్ పద్మావతి, ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహనరావు, ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, ప్రోగ్రాం అధికారులు రఘు కుమార్, కౌశిక్, క్వాలిటీ కన్సల్టెంట్ రఘు, కౌన్సిలర్ భవాని, డెమో సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటిడిఎకు తరలిరావాలి

ప్రజాశక్తి-కొమరాడ

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లేందుకు గురువారం ఐటిడిఎకు గిరిజనులు తరలి రావాలని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు హెచ్.రామారావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. పార్వతీపురం ఐటిడిఎకు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి గిరిజన సమస్యలు తెలుసుకోవడానికి వస్తున్నారని తెలిపారు. ఏజెన్సీలో జిఒ 3ను పునరుద్ధరించాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, తదితర సమస్యను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.శివుని నాయుడు పాల్గొన్నారు.

వెంగళరాయసాగర్‌కు జలకళ

- ఈ నెలలోనే సాగునీటి విడుదలకు సన్నద్ధం
- అంతంతగానే ఆధునికీకరణ
- అటకెక్కిన జైకా నిధులు!

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని మూడు మండలాల్లో 24,700 ఎకరాలకు సాగునీరు అందించే వెంగళరాయ సాగర్ కళకళలాడుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 161 మీటర్లు కాగా, ప్రస్తుతం 160 మీటర్లను దాటేసి, నిండుకుండలా తొణికిసలాడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి బెంగలేదన్న ఆనందం రైతుల కళ్లల్లో కనిపిస్తోంది. అయినా, పాలకుల నిర్లక్ష్యం ప్రాజెక్టు శివారు ఆయకట్టు రైతుల్ని వెంటాడుతోంది. కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టక పోవడంతో ఈ ఏడాదీ సాగునీరు అందుతుందన్న ధీమా వారికి లేకపోయింది.

ప్రజాశక్తి-మక్కువ

వెంగళరాయ సాగర్ రిజర్వాయరులో చేరిన నీరు

మూడు మండలాల రైతులకు సాగునీటి ప్రదాయినిగా ఉండే వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. గత ఏడాది కంటే ఈసారి రుతుపవనాలు ముందుగా రావడం, ప్రాజెక్టుకు అనుసంధానమైన నదుల ప్రవాహంతో ప్రస్తుతం 160 మీటర్ల పైబడి నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 161 మీటర్లు. బొబ్బిలి, సీతానగరం, మక్కువ మండలాలకు సంబంధించి ఖరీఫ్‌లో సుమారు 24,700 ఎకరాలకు సాగునీటి విడుదలకు సరిపడా నీటి నిల్వ చేరుకుంది. దీంతో ఇటీవలే ప్రాజెక్టు ప్రాంతంలో ఆయకట్టు సంఘాల నేతలతో సమావేశమైన ఇంజినీరింగ్ అధికారులు నీటి విడుదల విషయంపైనా చర్చించారు. ఈ నెలాఖరికే విడుదల చేయవచ్చుననే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

అటకెక్కిన జైకా నిధులు

వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.63.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అందులో సుమారు రూ.10 కోట్ల మేర నిధులతో కుడి ప్రధాన కాలువ లైనింగ్ పనులు కొంతమేర చేపట్టారు. ఈ పనులకు సంబంధించి సుమారు రూ.8.29 కోట్ల పనులు రికార్డింగ్ చేసినప్పటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ మిగిలిన పనులకు ఉపక్రమించలేదు. అనంతరం ప్రభుత్వం మారడంతో పాత పనులకు నిధుల కేటాయింపులో జాప్యం కూడా ఒకింత కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆధునికీకరణ పనులు మరింత ఆలస్యమయ్యే ఆస్కారం లేకపోలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

అంతంతగా కాలువ పనులు

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ఏడాది వేసవికాలంలో కాలువల్లో పూడిక తీత పనులు కొంతమేర చేపట్టారు. సుమారు రూ.79 లక్షలతో ఎస్‌డిఎంఎఫ్ నిధులతో దాదాపు 19 కాలువల్లో పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే వీటిలో కొన్నింటిని మాత్రమే పనులు జరగగా, ప్రస్తుత జూలై నాటికి మరల పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి ఆర్ఎంసిలోని 12ఎల్ కాలువ చప్పబుచ్చంపేట పరిధిలో పూర్తి అధ్వానంగా తయారైంది. ఈ ప్రాంతంలో సిమెంటు లైనింగ్ లేకపోవడంతో కాలువ పూర్తి స్థాయిలో కోతకు గురవుతూ ఉంది. దీనివల్ల శివారు ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి. మరోవైపు ఎల్‌బిసిలోని పలు కాలువల పరిస్థితి చూస్తే ఎప్పటికీ వార్తా వస్తువులుగానే నిలిచి ఉన్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు. గోముఖి నదిపై కొన్నాళ్ల క్రితం కూలిపోయిన అక్విడెక్ట్ పూర్తిస్థాయి నిర్మాణం జరిగితే తప్ప శంబర, కవిరిపల్లి, మార్కొండపుట్టి, పెద్దవలస భూములకు నీరు రాని పరిస్థితి అలాగే కొనసాగే ఆస్కారం ఉంది. కాదంబరిగెడ్డ వద్ద స్లూయిస్ దెబ్బతినడంతో కాస్త కూస్తా వచ్చే నీరు కూడా ఆయకట్టు భూములకు రాని పరిస్థితి నెలకొంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి సుమారు 25 లక్షల రూపాయలతో కొత్తగా లింక్ ఛానల్‌తోపాటు ఎల్‌బిసి, ఇతర కాలువల పనులకు ప్రతిపాదనలు కూడా ప్రతిపాదించినట్లు అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా సమగ్ర ప్రణాళిక రూపుదిద్దుకుని ప్రాజెక్టు ఆధునికీకరణ చేపడితే తప్ప ప్రస్తుతం ఉన్న ఆయకట్టు శివారు భూములతోపాటు అదనపు ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అంది పరిస్థితి లేదు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి శివారు ఆయకట్టు భూములకు కూడా నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో పిచ్చిమొక్కలు

ఏజెన్సీలోనే బదిలీ చేయాలని వినతి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులను ఏజెన్సీ ప్రాంతాల్లోనే బదిలీలు చేయాలని ట్రైబల్ డెవలప్మెంట్ మిషన్ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావుకు వినతి అందించారు. ఈ మేరకు విజయనగరంలో బుధవారం ఆయన్ను కలిసి వినతి అందించారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. చైర్మన్ ను కలిసిన వారిలో ట్రైబల్ డెవలప్మెంట్ చైర్మన్ తోరిక తిరుమలరావు, సవర చిరంజీవి, ఊయక నాగరాజు, సవర రాజారావు, సవర సురేష్, సవర చిన్నారావు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నారాయణమూర్తి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి బుధవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాను రూపొందించిన యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా ఆగస్టు 22న రిలీజ్ కానుందని, సినిమా విజయవంతం అయ్యేందుకు సహకరించాలని నారాయణమూర్తి కోరారు. ఈ సందర్భంగా నారాయణమూర్తిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. సామాజిక దృక్పథంతో సినిమాలు నిర్మించే ఆర్.నారాయణమూర్తి తాజా సినిమా యూనివర్సిటీ పేపర్ లీక్ విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



ఆర్.నారాయణమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం అన్ని పాఠశాలల హెచ్ఎంలు, డిప్యూటీ వార్డెన్లు, పీడీలతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మలేరియా వస్తే వెంటనే సమీప ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు. ఎక్కడైనా మలేరియా పాజిటివ్ వస్తే వెంటనే ఐటిడిఎ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలన్నారు. ఆర్ఒ ప్లాంట్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు వేడి నీరు అందించాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, డిప్యూటీ వార్డెన్లు, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఐఒ జగన్‌మోహనరావు

పిల్లలకు సకాలంలో టీకాలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని క్రిష్ణపల్లిలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వయల్స్‌ను పరిశీలించి ఉపయోగించిన తేదీలను నమోదు చేయాలన్నారు. ఎంతమందికి టీకాలు వేశారు, వారి గడువు తేదీలను పరిశీలించారు. పిల్లలకు సకాలంలో నిర్దేశించిన టీకాలను గడువు దాటక ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. టీకా వివరాలు యువిన్, ఆర్‌సిహెచ్ పోర్టళ్లలో అదే రోజు ఆన్లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ బరువు, ఎత్తు, స్థితి అక్కడ ఉన్న పరికరాల ద్వారా గమనించి రికార్డులో నమోదు చేసిన వివరాలతో పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిడెమియాలజిస్ట్ కౌశిక్, డెమో సన్యాసిరావు, వైద్య సిబ్బంది శిరీష, నిర్మల పాల్గొన్నారు.

18న కురుపాం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 18న స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలో అన్ని శాఖల అధికారులు మూడు నెలల ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని సూచించారు. సర్పంచులు, ఎంపిటిసిలు సమావేశంలో పాల్గొని, వారి పరిధిలో సమస్యలను తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

గెడ్డగట్టు ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో చెత్త డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న గోపసాగరం చెరువుకు నీటిని తీసుకెళ్లే గెడ్డ గట్టు ఆక్రమణకు గురవుతోందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు తహశీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. ఆక్రమణలను తొలగించాలని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల దాలినాయుడు, అధ్యక్షులు వారణాసి శ్రీహరి, ఉపాధ్యక్షులు చుక్క చంద్రరావు కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఉరిడి పంచాయతీ బొడ్డమానుగూడ గ్రామంలో ఇటికె బట్టి గొయ్యిల వద్ద పడి ఇద్దరు అమ్మాయిలు మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి, వైసిపి మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, మాజీ ఎంపిపి ఆనిమ ఇందిరా కుమారి ఆధ్వర్యంలో బుధవారం ఆ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆరిక రంగారావు ఎంపిటిసి జి.విద్యారాణి, వైసిపి నాయకులు ఐ.రామకృష్ణ, రామారావు, రాజారావు పాల్గొన్నారు.

స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి శంకరరావు

వసతిగృహాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నిర్మూలన భాగంగా వసతి గృహాల్లో స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామని రావాడ రామభద్రపురం పిహెచ్ వైద్యాధికారి చీకటి శంకరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతిగృహం, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం, ఎస్‌సి, బిసి వసతిగృహాల్లో ఐఆర్ఎస్ ఎసిఎం ద్రావణం స్ప్రేయింగ్ చేశారు. ఈ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ సూపర్వైజర్లు కె.రాధాకృష్ణ, ఇన్‌ఛార్జి హెచ్ఎం మల్లిపురం జగదీష్ పాల్గొన్నారు.

కస్పా వీధిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని రెండో సచివాలయ పరిధి కస్పా వీధిలో బుధవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల మధ్యలో పి4 గ్రామసభలు

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజల మధ్యలో పి4 గ్రామసభలు జరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పి 4 సర్వే, పారిశుధ్య కార్యక్రమంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గంలోని నిరుపేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకు వచ్చి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే పి4 కార్యక్రమం లక్ష్యమని అన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శితో సమన్వయం చేయాలన్నారు. కుటుంబంలోని పేదరికాన్ని నిర్మూలించడానికి ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే బంగారు కుటుంబాలు ఎంపిక చేశామని, ఎంపికైన జాబితాలను ఆయా గ్రామ సచివాలయ, మండల స్థాయిలో ప్రదర్శించాలని తెలిపారు. గ్రామసభలను నిర్వహించి ఆ జాబితాలో అభ్యంతరాలను స్వీకరించాలని ఆదేశించారు. గ్రామసభలు మొక్కుబడిగా నిర్వహించరాదని, ప్రజల మధ్యలో నిర్వహించాలని చెప్పారు. ఈ విషయమై ముందుగా గ్రామంలో చాటింపు వేయించి, ఇంటింటికీ తెలియ జేయాలని అన్నారు. వచ్చిన అభ్యంతరాలపై సమగ్రంగా రీసర్వే చేపట్టి, తుది నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. తొలగించవలసిన బంగారు కుటుంబాలతోపాటు కొత్తగా నమోదైన కుటుంబాల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమం బాగా జరగాలని, ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలో పారిశుధ్య పనులు చేపట్టిన పంచాయతీల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. పనిచేసి, నమోదుకాని పక్షంలో పనిచేయనట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెత్తను తొలగించడమే కాకుండా నీటి పరీక్షలు, ట్యాంకుల పరిశుభ్రత, దోమల నిర్మూలన చర్యలు వంటివి చేపట్టాలని అన్నారు. ఈ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉందని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తొలుత ప్రణాళిక శాఖ కన్సల్టెంట్ అమిత్ గుప్తా పి4పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, టి.కనకదుర్గ, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి. కరుణాకర్, ఎంపిడిఒలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



పార్వతీపురంటౌన్.. ర్యాలీ చేపడుతున్న న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకోవడమే రాజమార్గమని సీనియర్ న్యాయవాది, లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు అన్నారు. బుధవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, కక్షిదారులు, ప్రజలకు అవగాహన కోసం మధ్యవర్తిత్వం- దేశం కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది చట్టంలో ఒక భాగమని అన్నారు. కక్షిదారుల మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరించడానికి రాజీ మార్గం ప్రత్యామ్నాయ మార్గమని వివరించారు. ప్రజలకు మధ్యవర్తిత్వానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్, రైల్వే స్టేషన్, మున్సిపల్ ఆఫీస్, పాత బస్టాండ్ ప్రాంతాలలో ఫ్లెక్సీలు, బ్యానర్లను ప్రదర్శిస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మండల న్యాయ సేవా కమిటి న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు జి.వెంకటరావు, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం.. ర్యాలీ చేపడుతున్న న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు

కురుపాం : మధ్యవర్తిత్వంతోనే కేసులు పరిష్కారం సాధ్యమని లోక్ అదాలత్ సభ్యులు జి.వెంకటరావు అన్నారు. బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు నుండి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ కోర్టు ద్వారా కక్షదారుల మధ్యవర్తిత్వం వహించి కేసులు పరిష్కారమయ్యే రాజీ మార్గాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ అందవరపు కోటేశ్వరరావు, మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకొండ : మధ్యవర్తిత్వం- దేశం కోసం అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం కోర్టు నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు సిహెచ్ హరిప్రియ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమైన మార్గమన్నారు. కక్షిదారులకు మేలు చేకూరుతుందని చెప్పారు. మధ్యవర్తిత్వంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శామ్యూల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చంద్రబాబు చేసిన మోసాలేమిటి?

వైసిపి నాయకులకు మంత్రి సంధ్యారాణి ప్రశ్న

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో దివాలా తీసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ, సంక్షేమ పథకాలను అందజేస్తున్న సిఎం చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో సమాధానం చెప్పాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి.. వైసిపి నాయకులను ప్రశ్నించారు. బుధవారం సాలూరు మండలం కురుకుట్టి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నాయకులు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గుర్తించకుండా మోసాలుగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంపంగిపాడు, డెన్సరాయి సర్పంచులు చంద్రయ్య, మావుడి పొట్టయ్య, టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, ఎఎంసి డైరెక్టర్ రామన్న దొర, గిరిజన నాయకులు లక్ష్మణదొర, కోట లక్ష్మణ, వెంకటి, లక్ష్మి, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యాలవలసలో సుపరిపాలన తొలి అడుగు

కురుపాం : మండలంలో బియ్యాలవలసలో టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సుకేష్ చంద్ర పండా, కో - క్లస్టర్ సువ్వాన గోవిందరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

ఎమ్మెల్యే జగదీశ్వరి

తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-కొమరాడ

ఏజెన్సీలో మారుమూల గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా మంచినీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కెమిశిల పంచాయతీ లాబేసు, తులసివలసలో జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.26.10 లక్షలు, రూ.36 లక్షలతో నిర్మించిన రెండు తాగునీటి పథకాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌరీశంకర్, టిడిపి మండల అధ్యక్షులు సేనపతి శేఖర్ పాత్రుడు, నాయకులు దేవకోటి వెంకటనాయుడు, ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు, ఎఎంసి డైరెక్టర్ నీరస శ్రీనివాసరావు, నాయకులు పి.వెంకటనాయుడు, పి.హరి ప్రసాద్, బి.తమ్మయ్య, బలరాం, భానూజీరావు, వి.రాఘవ, సత్తిబాబు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో తనిఖీలు

రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ, ఎఎస్‌పి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా కేంద్రంలోని వన్ స్టాప్ సెంటర్‌ని బుధవారం డిఆర్ఒ కె.హేమలత, ఎఎస్‌పి అంకిత సురాన తనిఖీ చేశారు. సెంటర్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పోక్సో కేసుల బాధితులకు ఈ కేంద్రంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారని ఎఎస్‌పి ప్రశ్నించారు. ఈ కేసుల్లో బాధితులకు ఎంతమందికి ఇంతవరకు పరిహారం చెల్లించారని అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాలలో మహిళల రక్షణ కోసం ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీ, లోకల్ కంప్లయింట్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇంతవరకు 435 కమిటీ లను ఏర్పాటు చేశామని చెప్పారు. వివాహ వ్యవస్థపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ తోట కనకదుర్గ, సెంటర్ అధికారి జి.ఎస్ కుమారి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత మృతి

ప్రజాశక్తి-పాచిపెంట

ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండలంలోని పనసలపాడు గ్రామానికి చెందిన పెదకాపు జయమ్మ (24) పురుగుల మందు తాగి మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం... పనసలపాడు గ్రామానికి చెందిన జయమ్మకు, అదే గ్రామానికి చెందిన పెదకాపు రవికి ఏడాది క్రితం వివాహమైంది. వీరికి మగబిడ్డ కూడా జన్మించాడు. అనారోగ్యంతో ఆ బిడ్డ చనిపోయాడు. బిడ్డ చనిపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా జయమ్మ మానసిక క్షోభకు గురైంది. కూలీ పనుల కోసం హైదరాబాద్ వెళ్లిన జయమ్మ ఈ నెల 7న పురుగుల మందు తాగింది. అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మరణించింది. జయమ్మ తల్లి సోమాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట సురేష్ కేసు నమోదు చేశారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి-కొమరాడ

గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు వైద్య సేవలు సక్రమంగా అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో ఉన్న ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాల, పెదఖేర్జల ఆశ్రమ బాలుర పాఠశాలను ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న సేవలపై, అక్కడున్న సమస్యలపై ఆరాతీసింది. పెదఖేర్జల స్కూల్లో ఎఎన్ఎం లేకపోవడం వల్ల జ్వరాలు వచ్చేటప్పుడు ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడాన్ని తెలుసుకున్నారు. ఉలిపిరి ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల రాత్రిపూట విషసర్పాలు లోపలికి వస్తున్నాయని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన నిలదీశారు. రెండు వసతిగృహాల్లో దోమతెరలు లేవని, కిటికీలకు మెస్‌లు లేవని గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవాలలో భాగంగా పట్టణంలో 1, 30 వార్డులలో బుధవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు, 15 సచివాలయాల శానిటరీ సెక్రటరీలు హాజరై, కాలువలలో యాంటీ లార్వా ఆపరేషన్, రహదారులు, మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలో గుచ్చిమి, రంగంపేట గ్రామాలలో పారిశుధ్య పక్షోత్సవాల కార్యక్రమాలను ఎంపిడిఒ ఎంఎస్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్ల వద్ద మురుగునీరు తొలగించడం, కాలువల్లో పూడిక తీత, క్లోరినేషన్ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న గిరిజన రైతులు, గిరిజన సంఘం నాయకులు

వన్‌బిల కోసం రైతుల నిరసన

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన రైతులు సాగు చేస్తున్న భూమికి వన్‌బి, అడంగల్ ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూరంగి సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం జియ్యమ్మవలస మండలంలోని డంగభద్రవలసలో గిరిజన రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు వన్‌బి, అడంగల్ లేకపోవడంతో వ్యవసాయ రుణాలు తీసుకోలేక పోతున్నారని, రెన్యువల్ కావడం లేదని చెప్పారు. అన్నదాత సుఖీభవ, రాయితీలు కోల్పోతున్నారని చెప్పారు. సాగుచేస్తున్న భూమి మొత్తానికీ వన్‌బి, అడంగల్ ఇవ్వాలని, లేకుంటే గిరిజన రైతులందరినీ కదిలించి, కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

భూ యజమానులు సహకరించాలి

వ్యవసాయ శాఖ జెడి రాబర్ట్‌పాల్

ప్రజాశక్తి-వీరఘట్టం

యూరియా పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న జెడి రాబర్ట్‌పాల్

కౌలుదారులకు భూ యజమానులు సహకరించి, వారికి గుర్తింపు కార్డులు వచ్చే విధంగా చొరవ చూపాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రాబర్ట్‌పాల్ సూచించారు. బుధవారం మండలంంలోని చలివేంద్రి, వండువ రైతు సేవా కేంద్రాల ద్వారా చేపడుతున్న యూరియా పంపిణీని ఆయన పరిశీలించారు. కౌలుదారులు గుర్తింపు కార్డులు పొందాలంటే దానికి తగిన ఆధారాలు భూ యజమానులు ఇవ్వాలన్నారు. కౌలుదారులకు హక్కు పత్రాలు ఇచ్చినంత మాత్రాన భూ యజమానులకు ఎటువంటి నష్టమూ ఉండదని ఆయన స్పష్టం చేశారు. గుర్తింపు కార్డులు ఉంటేనే కౌలుదారులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, ప్రస్తుతం ఆకుముడులకు వేసుకోవడానికి యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో అధిక మొత్తంలో యూరియాని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచేందుకు అన్ని విధాలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చలివేంద్రి, వండువ, తూడి, మరో మూడు రైతు సేవా కేంద్రాల ద్వారా 60 టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు వివరించారు. రైతులు యూరియా కోసం ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి కె.రత్నకుమారి, ఎఒ జక్కువ సౌజన్య, విఎఎలు సౌమ్య, చిన్నారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి రాంబాబు

వ్యసనాలకు బానిస కావొద్దు

పాలకొండ డిఎస్‌పి రాంబాబు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు చదువుకునే ప్రాయంలో మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జీవితాన్ని చక్కదిద్దుకోవాలని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు సూచించారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం కెజిబివిలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకున్న నాడే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకొంటారని తెలిపారు. చాలామంది యువత , విద్యార్థులు గంజాయి, నాటు సారా, మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని పూర్తిగా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

ఇది మంచి పద్ధతి కాదన్నారు. డ్రగ్స్ తీసుకున్న వారికి చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సెల్‌ఫోన్ వాడకం చెడు ప్రభావం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ హరి, ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీరంజిని, తదితరులు ఉన్నారు.